## పన్నుల వసూలు నూరుశాతం చేయాలి

**ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి**



మాట్లాడుతున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మం, మార్చి 26 : ఖమ్మం కార్పొరేషన్‌లో ఇంటిపన్ను వడ్డీపై రాయితీ చెల్లించడానికి మరో ఐదురోజుల గడువు మాత్రమే ఉన్నందున ప్రత్యేక అధికారులు, బిల్ కలెక్టర్లు చొరవ చూపి వందశాతం పన్నుల వసూలుకు కృషి చేయాలని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ పన్నులు చెల్లించని వారి జాబితా సిద్ధంగా ఉందని, వారిపై దృష్టిసారించి లక్ష్యాన్ని సాధించాలన్నారు. రాయితీ వలన వారికి కలిగే ప్రయోజనాలను వారికి వివరించాలన్నారు. బిల్ కలెక్టర్లు ప్రతిరోజు ఉదయం 7గంటలకే విధుల్లో ఉండాలని ఆదేశించారు. వివిధ వృత్తుల్లో ఉన్నవారు సాయంత్రం ఇంటికి చేరుకొనే సమయానికి బిల్ కలెక్టర్లు వెళ్లి పన్నులు వసూలు చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్, స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## భూసేకరణ పనులను వేగవంతం చేయాలి: కలెక్టర్

మామిళ్లగూడెం, మార్చి 26 : జిల్లాలో నీటిపారుదలశాఖకు సంబంధించి పురోగతిలో ఉన్న ప్రాజెక్టుల భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్, మున్నేరు రిటెయినింగ్ వాల్ ప్రాజెక్టుల కోసం భూసేకరణ చర్యలు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, నీటిపారుదల శాఖ సీఈలు విద్యాసాగర్, శ్రీనివాసరెడ్డి, ఎస్డీసీ ఎం.రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో జి.గణేష్, ఎస్‌ఈలు, ఈఈలు, డీఈలు, అధికారులు పాల్గొన్నారు.

## వినూత్న ఆలోచనలతో అద్భుత భవిష్యత్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల చైర్మన్ కృష్ణ

ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 26 : ప్రపంచంలో వేగంగా మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకొని నూతన ఆలోచనలతో ఆవిష్కరణలు చేసేవారికి అద్భుత భవిష్యత్ ఉంటుందని ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ అన్నారు. మంగళవారం ఖమ్మం నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో జరిగిన ఐడియా థన్ వర్క్‌షాపులో ఆయన ప్రసంగించారు. ది రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ హబ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఐదురోజులపాటు శిక్షణ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్, నూతన ఆలోచనలను ఎక్స్‌పోలో ప్రదర్శించనున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఆడ్డిఐవో కార్తీక్, శ్రీకాంత్, శ్రీనివాసరావు, స్ఫూర్తి పాల్గొన్నారు.

## 'స్పాట్' నుంచి మినహాయింపు ఇవ్వాలి

ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 26 : పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్‌లో అనారోగ్యంతో బాధపడుతున్నవారు, దివ్యాంగులు, మూడేళ్లలోపు పదవీ విరమణ ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో డీఈవో సోమశేఖర శర్మకి మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో ఆ సంఘం నాయకులు మోతుకూరి మధు, వైవీ, రెబ్బా శ్రీను, హుస్సేన్, కట్టా శేఖర్ పాల్గొన్నారు.

## సీఆర్వో కార్యాలయ బాత్‌రూంలో మృతదేహం

భద్రాచలం, మార్చి 26: పట్టణంలోని తానీషా కల్యాణ మండపం (సీఆర్వో) కార్యాలయం పై అంతస్తులోని బాత్‌రూంలో మంగళవారం ఓ మృతదేహాన్ని ఉద్యోగులు గుర్తించారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వసతి గృహంలో టైల్స్ వేసేందుకు వారం రోజుల క్రితం ఖమ్మంకు చెందిన జాఫర్ (40) అనే కార్మికుడు వచ్చి పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం శవమై కనపించడంతో ఉద్యోగులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా వైద్యశాల మార్చురీకి తరలించారు.

## 'లెవలింగ్ కార్మికులను కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించాలి'

మణుగూరు టౌన్, మార్చి 26: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సింగరేణి వేబ్రిడ్జి కోల్ లారీ లోడింగ్, అన్ లోడింగ్ లెవలింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు మంగళవారం స్థానిక ప్రజాభవన్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ బాధ్యులు మాట్లాడుతూ.. వేబ్రిడ్జి కోల్ లారీ లోడింగ్, అన్‌లోడింగ్ లెవలింగ్ కార్మికులను సింగరేణి కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించి వేతనాలు చెల్లించాలని, సీఎంపీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఖాళీగా ఉన్న క్వార్టర్లను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ నాయకులు జక్కుల రాజబాబు, కృష్ణ, శంకర్, కాంగ్రెస్ నాయకులు పీరినాకి నవీన్, గాండ్ల సురేశ్, సుధాకర్, బీ.శివ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **నేలకొండపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **మంద వీరబాబు,** S/o : **వీరభద్రం, వయస్సు :** 29సం||లు, **వృత్తి :** వ్యాపారం, **నివాసం :** కూసుమంచి గ్రామం మరియు మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు.కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **3** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి :** ఖమ్మం రిజిస్ట్రేషన్ జిల్లా కూసుమంచి సబ్ జిల్లా, ఖమ్మం జిల్లా ప్రజాపరిషత్ కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ వారి అధికార పరిధిలోని కూసుమంచి మండలం, కూసుమంచి గ్రామ పంచాయితీ పరిధిలోని కూసుమంచి రెవిన్యూ గ్రామ సర్వే నెం. 341/ఇ, మిం.లే., **డాక్యుమెంట్ నెం. 7180/2018,** విస్తీర్ణము : 241-89 చ||గ|| = 202-24 చ||మీ|| గల స్థిరాస్థినకు హద్దులు : **తూర్పు :** అర్వపలిల పద్మ గారి ఖాళీ స్థలం, **పడమర :** వేములూరి లక్ష్మీనారాయణ గారి ఖాళీ స్థలం, **ఉత్తరం :** 20 అడుగుల వెడల్పు గల రోడ్డు, **దక్షిణం :** ఆకారపు వెంకటాచారి గారి ఖాళీ స్థలం.

**జి.హరేందర్ రెడ్డి**
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

### ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **నేలకొండపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **కొప్పుల ముత్తమ్మ** W/o : **నాగయ్య, వయస్సు :** 49సం||లు, **వృత్తి :** గృహిణి, **నివాసం :** ఇ.నెం. 1-21, ముదిగొండ గ్రామం మయు మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు.కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **3** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి :** ఖమ్మం జిల్లా అష్యూరెన్సుల రిజిస్ట్రార్ మయు ముదిగొండ సబ్ రిజిస్ట్రార్ వారి అధికార పరిధిలోని ముదిగొండ రెవిన్యూ మండల పరిధిలోని ముదిగొండ రెవిన్యూ గ్రామ పరిధిలోని ముదిగొండ గ్రామపంచాయితీ పరిధిలోని ముదిగొండ గ్రామకంఠం నందు గల విస్తీర్ణము : 824-00 చ||గ|| లేక తత్సమానం 688.94 చ||మీ|| విస్తీర్ణము గల అందులో నిర్మాణము కాబడిఉన్న H.No.1-21, RCC Roofed House నిర్మాణ వైశాల్యం : ACC Roof House: 278-43 చ||అ||, నిర్మాణము వైశాల్యం :ACC Sheet Toilets : 30.25 చ||అ||, **డాక్యుమెంట్ నెం. 875/2020** మరియు అందుగల శానిటరీ ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్ Service Connection మరియు సమస్త ఫిక్చర్స్ సహితముగా గలట్టి ఈ దాన గృహస్తినికి సరిహద్దులు :**తూర్పు :** రావులపాటి సత్యం గారి ఖాళీ స్థలం, **పడమర :** ఆర్ అండ్ బి రోడ్డు, **ఉత్తరం :** పటాన్ పాషా గారి ఇల్లు, **దక్షిణం :** అబ్బూరి శ్రీను గారి ఖాళీ స్థలం.

**జి.హరేందర్ రెడ్డి**
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# మునిసిపల్ కౌన్సిలర్‌పై కాంగ్రెస్ కార్యకర్తల దాడి



కౌన్సిలర్‌ను పరామర్శిస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేశ్

సత్తుపల్లి, మార్చి 26: మున్సిపాలిటీలోని ఎన్టీఆర్‌నగర్ 8వ వార్డు కౌన్సిలర్ షేక్ చాంద్‌పాషాపై సోమవారం రాత్రి ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారు. సత్తుపల్లిలో బైక్ మెకానిక్ షాపు నిర్వహిస్తున్న చాంద్‌పాషా రాత్రి షాపు బంద్ చేసి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా వేంసూరు రోడ్‌లోని నీలాద్రి అర్బన్ పార్కు ఎదుట కొందరు కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు పాషా వాహనాన్ని అడ్డుకొని దాడికి దిగారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు ఘటనా స్థలానికి చేరుకుని పాషాను సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ ఆసుపత్రికి వెళ్లి చాంద్‌పాషా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

**కౌన్సిలర్‌పై దాడిపై సండ్ర ఖండన**

చాంద్‌పాషాపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చేసిన దాడిని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఖండించారు. కాంగ్రెస్ నాయకులు చాంద్‌పాషాను చంపేస్తామంటూ బెదిరించడం అమానుష చర్యగా అభివర్ణించారు. దాడి చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం : కేటీఆర్



షేక్ చాంద్‌పాషాపై జరిగిన దాడి విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఫోన్‌లో చాంద్‌పాషాను పరామర్శించారు. అధైర్యపడొద్దు.. అండగా ఉంటామంటూ పాషాకు భరోసా కల్పించారు. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు.

**చాంద్‌పాషాపై దాడిని ఖండించిన బీఆర్‌ఎస్ నాయకులు**

పెనుబల్లి, మార్చి 26: సత్తుపల్లి మున్సిపల్ వార్డు కౌన్సిలర్ షేక్ చాంద్‌పాషాపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడంపై పెనుబల్లి బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం తీవ్రంగా ఖండించారు. రాబోయే రోజుల్లో ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారని, అధికారం శాశ్వతం కాదనే సంగతి గుర్తించాలన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, కార్యదర్శి భూక్యా ప్రసాద్, ఎంపీపీ లక్కినేని అలేఖ్యవినీల్, జడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, వైస్‌ఎంపీపీ నరుకుళ్ల కస్తూరి తదితరులు దాడిని ఖండించారు.

**కౌన్సిలర్‌పై దాడి హేయమైన చర్య**

వేంసూరు, మార్చి 26: సత్తుపల్లి మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్ చాంద్‌పాషాపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యాలు ఇలానే కొనసాగితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఖండించిన వారిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాలా వెంకటరెడ్డి, పార్టీ కార్యదర్శి గొర్ల సంజీవరెడ్డి, జడ్పీటీసీ మారోజు సుమలత, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

## 'సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం'



వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

మధిర, మార్చి 26: వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేయక తప్పదని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు బెజవాడ రవి స్పష్టం చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ మేనేజర్ రవీందర్‌కు మున్సిపల్ కార్మికులతో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు ప్రతినెలా వేతనాలు సక్రమంగా రావడం లేదని, కార్మికుల వేతనాల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ పేరుతో ప్రతి నెలా సొమ్ము మినహాయిస్తున్నప్పటికీ కార్మికులకు సమాచారం అందడం, ఈఎస్ఐ గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదని అన్నారు. నాయకులు చటారి నాగేంద్ర, పుల్లూరి నరేశ్, గద్దల శ్రీకాంత్, చటారి కుమారి, ఎండ్రవల్లి చిన్న, చిలివేరు సురేశ్, గడ్డం మార్తమ్మ, రుద్రాపు నాగమ్మ, గద్దల కుమారి, ఆర్.మారతమ్మ, జీ.లక్ష్మి, కనకపుడి అను తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సమస్యలపై ఐఎన్‌టీయూసీ వినతి

సత్తుపల్లి, మార్చి 26: సత్తుపల్లి జేవీఆర్ సీహెచ్‌పీ ఉద్యోగుల ఆరోగ్యం, సంరక్షణను దృష్టిలో ఉంచుకొని కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మంగళవారం డీవైజీఎం సోమశేఖర్‌కు ఐఎన్‌టీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. జేవీఆర్ సీహెచ్‌పీలో పనిచేసే ఉద్యోగులకు ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలని, పనివేళల్లో మార్పులు చేయాలని పేర్కొన్నారు. స్పందించిన డీవైజీఎం తగిన చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, తీగల క్రాంతి కుమార్, నగేశ్, రమేశ్, ఈశ్వర్, చంద్రమౌళి, రాజమౌళి, శంకర్, మోహన్‌కుమార్, మోహనలాల్, ప్రభాస్, చందు, రాజు, వెంకటేశ్వర్లు, యాకూబ్‌పాషా పాల్గొన్నారు.



డీవైజీఎం సోమశేఖర్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

## 'వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి'




మాట్లాడుతున్న డాక్టర్ ప్రసన్నజ్యోతి

మధిర, మార్చి 26: వ్యాధులు దరిచేరకుండా విద్యార్థులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ప్రముఖ సివిల్ సర్జన్ కే.ప్రసన్నజ్యోతి సూచించారు. 'అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులు – జాగ్రత్తలు' అనే అంశంపై మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల్లో ఆమె మాట్లాడారు. వ్యాధుల నివారణ చర్యలు పాటించాలని సూచించారు. రోగనిరోధక శక్తి, రక్తనిల్వలు పెరిగేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కళాశాల బాధ్యులు శాస్త్రి, కే.రవికుమార్, డాక్టర్ పీ.సుజాత, గజీ అరుణ, డాక్టర్ కే.వీరన్న, ఎం.నివాసరావు, కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పిన లారీ

సత్తుపల్లి, మార్చి 26: అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి వైపు వస్తున్న లారీ మంగళవారం తెల్లవారుజామున అదుపుతప్పి పట్టణ శివారులోని పెద్ద వంతెన వద్ద రైలింగ్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో రైలింగ్ పడిపోయినట్లయితే లారీ తమ్మిలేరు వాగులో పడి ప్రమాదం సంభవించేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇటీవల వరుసగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి సూచికబోర్డులు ఏర్పాటు చేయకపోవడం శోచనీయం.



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన లారీ

## కనుల పండువగా రాజగోపాలుని కల్యాణోత్సవం



నేలకొండపల్లి: రాజగోపాలస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



సత్తుపల్లి: పూజలు చేస్తున్న భక్తులు

కూసుమంచి (నేలకొండపల్లి), మార్చి 26: నేలకొండపల్లిలోని శ్రీ రాజగోపాలస్వామి దేవస్థానంలో బ్రహోత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి వారి తిరుకల్యాణం కనుల పండువగా సాగింది. ఆలయ అర్చకుడు మూడుంబ రామానుచారార్యులు, ఈవో శ్రీకాంత్, పూజారులు పవన్‌కుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



మధిర రూరల్: అన్నదానం చేస్తున్న దాతలు

**మెట్టాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం**

సత్తుపల్లి, మార్చి 26: పట్టణంలోని వేంసూరు రోడ్‌లో ఉన్న మెట్టాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు పెద్ద ఎత్తున పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణానికి చెందిన కోరుకొండ లక్ష్మీనారాయణ, స్వరాజ్యం జ్ఞాపకార్థం కనిగొళ్ల గోపాలకృష్ణ, లక్ష్మీతాయారు అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా రాజస్థాన్ యూత్‌స్వామి వారికి 20 ట్యూబ్‌లైట్ సెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**ఆంజనేయస్వామి ఆలయం వద్ద..**

మధిర రూరల్, మార్చి 26: మండలంలోని ఆత్కూరు గ్రామ సమీపంలో గల అభయాంజనేయస్వామి ఆలయం వద్ద దాతలు అంకె అప్పారావు, సంధ్యారాణి దంపతుల వితరణతో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలను అభినందించారు. దేవాలయ కమిటీ సభ్యులు వెలగపుడి పూర్ణ, డాల్ కృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

## జేవీఆర్ ఓసీ సందర్శన



జేవీఆర్ ఓసీలో శిక్షణ బీట్ ఆఫీసర్లు

సత్తుపల్లి, మార్చి 26: నూతనంగా ఉద్యోగాలు సాధించిన బీట్ ఆఫీసర్ల బృందం మంగళవారం జేవీఆర్ ఓసీని సందర్శించారు. దూలపల్లిలో శిక్షణ పొంది అనంతరం శిక్షణలో భాగంగా జేవీఆర్ ఓసీని సందర్శించి ఓపెన్‌కాస్ట్ గనులు, యంత్రాలు, కార్మికుల పనితీరు, బొగ్గు ఉత్పత్తి తదితర అంశాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో రామ్మోహనరావు, సునీల్‌కుమార్, సురేశ్, నాగరాజుతోపాటు శిక్షణ బీట్ ఆఫీసర్లు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ట్రక్కు అపహరణ

వైరారూరల్, మార్చి 26: మండలంలోని విప్పలమడక గ్రామంలో ట్రాక్టర్ ట్రక్కు చోరీ జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దేవభక్తిని అర్జున్‌రావుకు చెందిన ట్రాక్టర్ ట్రక్కు కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి వైరా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దాని విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని ఆయన తెలిపాడు.

## గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

రఘునాథపాలెం, మార్చి 26 : మహాత్మా జ్యోతీబాపూలే తెలంగాణ వెనుకబడిన గురుకుల కళాశాల, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ గురుకుల డిగ్రీ కళాశాలల్లో 2024-25 సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేంసాని వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసి డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు అర్హులన్నారు. ఏప్రిల్ 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9848161319, 8019422103 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కూసుమంచి, మార్చి 26: కూసుమంచి మండలం జీళ్లచెరువు 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంతటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌లో ఏఈ గ్రేసీ సుజన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లోని మరమ్మతు పనుల రీత్యా జీళ్లచెరువు, కేశ్వాపురం, ముత్యాలగూడెం, ధర్మాతండా, దేవునితండా, చింతల్‌తండా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు.

## 'అందరికీ శుభం కలగాలి'



ఇఫ్తార్ విందులో దయాకర్‌రెడ్డి

కూసుమంచి (నేలకొండపల్లి), మార్చి 26: ముస్లింల పవిత్ర రంజాన్ మాసంలో అందరికీ శుభం కలగాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తంబూరి దయాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. నేలకొండపల్లి మైనారిటీ నాయకుడు డాక్టర్ సోందు మంగళవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో దయాకర్‌రెడ్డి మాట్లాడారు. నాయకులు నెల్లూరి భద్రయ్య, చెరువు స్వర్ణ, మామిడి వెంకన్న, వంగవీటి నాగేశ్వరరావు, మత పెద్దలు పాల్గొన్నారు.

## 'అమ్మే దేవత - నాన్నే దేవుడు' సీడీ ఆవిష్కరణ



సీడీని ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

తిరుమలాయపాలెం, మార్చి 26: ప్రజా నాట్య మండలి మండల కార్యదర్శి గుండమళ్ల ఉపేందర్ రూపొందించిన 'అమ్మే దేవత – నాన్నే దేవుడు' అనే నృత్యరూపక సీడీని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు ఆవిష్కరించారు. మండలంలోని బచ్చోడులో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఎలా సంరక్షించుకోవాలనే అంశంపై నృత్యరూపకం రూపొందిండచం అభినందనీయమని అన్నారు. నాయకులు బుగ్గవీటి సరళ, బషీరుద్దీన్, కొమ్ము శ్రీను, అంగిరేకుల నర్సయ్య, బింగి రమేశ్, తిమ్మిడి హనుమంతరావు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ గెలుపు కోసం పని చేయాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కారేపల్లి, మార్చి 26: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలని బీఆర్‌ఎస్ మండల నాయకుడు బత్తుల శ్రీనివాసరావు అన్నారు. ఆయన మాజీ సర్పంచ్ మాలోత్ కుమార్‌తో కలిసి మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గత ఎన్నికల్లో లాగానే ఈ సారి కూడా భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు.

## పైప్‌లైన్ లీకేజీ.. పట్టించుకోని అధికారులు

వైరా టౌన్, మార్చి 26: వైరాలోని స్థానిక మధిర రోడ్డులో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి తాగునీరు వృధాగా పోతోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వైరా రిజర్వాయర్ నుంచి వస్తున్న హెవీ పైప్‌లైన్ పగిలిపోవడంతో గత రాత్రి నుంచి తాగునీరు వృథాగా పోతూ మధిర రోడ్డులో చిన్నపాటి చెరువును తలపిస్తున్నది. తక్షణమే అధికారులు స్పందించి పటిష్ట చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన పారుతున్న మిషన్ భగీరథ నీరు